بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 27.09.2019 (Telugu)**

**రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ప్రేమ ఇతర మానవులందరి కంటే ఎక్కువ వుండవలెను ఎందుకనగా ఇప్పడు అల్లాహ్ తఆలా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారనే గుర్తించబడును వారి ఆదేశములను పాటించి, వారి సున్నత్ (పద్ధతిని) ఆచరించి మాత్రమే అల్లాహ్ తఆలా వరకు చేరుకోవచ్చును. దుఆల ఆమోదము, జీవితము శుభమగుటకు వారిని ఆదర్శంగా తీసుకోవలెను**

**హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి**

**అల్లాహ్ తఆలా దృష్టిలో ప్రియులగుటకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరించుట అనివార్యము - మరే మార్గము ద్వారా మీరు అల్లాహ్ తఆలా దరి చేరలేరు.**

*హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 27.09.2019 తేదీన - సభా ప్రాంగణము హాలేండ్, నన్స్‌పీట్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. అల్లాహ్ తఆలా కృపానుసారము నేడు హాలేండ్ జల్సా సాలానా (వార్షిక సభ) ప్రారంభమగుచున్నది. చాలా సంవత్సరముల పిదప మీ జల్సాలో పాల్గొను అనుగ్రహము అల్లాహ్ తఆలా నాకు కల్పించుచున్నాడు. గత కొన్ని సంవత్సరములలో హాలేండ్ జమాఅత్ సంఖ్య పెరిగినది. చాలా మంది పాకిస్తానీయులు వలసదారులుగా ఇక్కడికి వచ్చారు. కొందరు క్రొత్త వారు కూడ జమాఅత్‌లో చేరారు. ప్రపంచములోని ఇతర జమాఅతుల వలె హాలేండ్ జమాత్ కూడ ప్రగతి చెందుచున్నది. నూతన కేంద్రములు ఏర్పడినవి. మస్‌జిద్ కూడ నిర్మించబడినది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. సంఖ్యలో పెరుగుట లేదా ప్రచార కేంద్రములు ఏర్పాటు చేసుకొనుట లేదా మస్‌జిద్ నిర్మించుట వంటి పనులు వాటి ఉద్ధేశ్యములను పూర్తి చేసినప్పుడే లాభదాయకమగును. కావున ఇక్కడున్న ప్రతి అహ్మది ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరమున్నది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం బైఅత్ చేసిన ఉద్ధేశములు ఏమిటో గ్రహించవలెను. గత కొన్ని సంవత్సరములలో చాలా అహ్మదీయులు ప్రస్థానము చేసి ఇక్కడికి వచ్చారని నేనింతకు ముందే చెప్పినాను. ఎందుకు ప్రస్థానము చేసి వచ్చారు? ఎందుకనగా పాకిస్తాన్‌లో అహ్మదీయులకు బొత్తిగా ధార్మిక స్వాతంత్ర్యము లేదు. మతము పేరున అహ్మదీయులు హింసకు గురగుచున్నారు. వారి హక్కులు ఉల్లంఘించబడుచున్నవి. మస్‌జిదులు నిర్మించు ఆలోచన పక్కన బెట్టండి. సభ్యుల శిక్షణ కొరకు సభలు, సమావేశములు నిర్వహించుటకు కూడ ఆటంకములు ఎదురగుచున్నవి. చట్టపరంగా గృహములలో కూడ మనము నమాజ్ చదవలేము. ఖుర్బానీ పండుగ సందర్భమున మనము పశువులను బలిదానమివ్వలేము. ఎందుకనగా చట్టము ఇందుకు అనుమతించదు. వాజ్యములు వేయబడును. ప్రతి అహ్మది ఇక్కడ ఇటువంటి ఆంక్షలకు దూరముగా జీవితము గడుపుచున్నాడు. ఇందుకు అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలుపవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం బైఅత్ చేయు హక్కును చెల్లించుటకు పూర్తిగా ప్రయత్నించవలెను. తమ ఆధ్యాత్మిక, విద్యా, ప్రవర్తనపరంగా తమ స్థితిని మెరుగుపరచుకోవలెను. మన కర్మలు అల్లాహ్ తఆలా ఆదేశముల ప్రకారము లేనిచో మనము గతము కంటే ఎక్కువ మనలో పవిత్ర మార్పులు కలిగించుకొనుటకు ప్రయత్నించినామా ? అల్లాహ్, అతని ప్రవక్త పట్ల గతము కంటే ఎక్కువ శ్రమను వ్యక్తపరుస్తున్నామా లేదా? లేనిచో ఈ స్వాతంత్ర్యము దేనికి ఉపయోగపడును? ఈ సభలలో పాల్గొనుటతో ప్రయోజనమేమిటి? మస్‌జిదుల నిర్మాణముతో

ప్రయోజనమేమిటి? బైఅత్ హక్కులు చెల్లించినప్పుడే ఈ స్వాతంత్ర్యము ద్వారా ప్రయోజనము కలుగును. మస్జిదుల ఉద్దేశములను వివరించుచు ఒక సందర్భమున హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం తమ బైఅత్ చేసిన వారికి ఉపదేశమిచ్చుచు ఇట్లనిరి. జమాఅత్‌లో బైఅత్ చేసి, చేరిన వినమ్రులందరు గుర్తుంచుకోగలరు. ప్రాపంచిక ప్రేమ తగ్గాలని, తమ యజమాని అనగా హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం ప్రేమ అధికము అగుట, పరలోక ప్రయాణము భారము కాని విధంగా పవిత్ర పరిస్థితి ఏర్పడుటయే బైఅత్ చేయు ఉద్దేశము.

నా బైఅత్ చేసిన వారికి కేవలం నోటి ప్రకటనలు సరిపోవు. వినమ్రులలో చేరవలెను. వినమ్రత, విశ్వసనీయతలో అభివృద్ధి చెందినప్పుడే అల్లాహ్ తఆలా, అతని ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం ప్రేమ అన్ని ప్రేమల కంటే అధికమగును. ఇదొక స్పష్టమైన ఆదేశము. అందుకే వారు బైఅత్ నిబంధనలలో కూడ ఈ నిబంధన ఇలా పెట్టినారు. బైఅత్ చేయు వ్యక్తి అల్లాహ్ తఆలా, అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశములను ప్రతి విషయములో ఆదర్శముగా చేసుకొనును. మన బైఅత్ ఉద్దేశము ఏమిటో పదే పదే గుర్తు చేయించుటకే ఈ జల్సాలు (సభలు) నిర్వహించబడును. ప్రాపంచిక ప్రేమ పూర్తిగా చల్లబడుట, అల్లాహ్ తఆలా, అతని ప్రవక్త ప్రేమ అధికమగుట అనే విషయము ఏదో సాధారణ విషయము కాదు. ఎందుకనగా ఇందుకు చాలా శ్రమించాల్సి వచ్చును. మనము బైఅత్ చేసినందున ఇందుకు తప్పక మనము శ్రమించవలెను.

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రేమ గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనకు గుర్తు చేయించిరి. వారు స్పష్టముగా ఇట్లు సూచించిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ప్రేమ ఇతర మానవులందరి కంటే ఎక్కువ వుండవలెను. ఎందుకనగా ఇప్పుడు అల్లాహ్ తఆలా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారనే గుర్తించబడును. వారి ఆదేశములను పాటించి, వారి సున్నత్ (పద్ధతిని) ఆచరించి మాత్రమే అల్లాహ్ తఆలా వరకు చేరుకోవచ్చును. దుఆల ఆమోదము, జీవితము శుభమగుకు వారిని ఆదర్శంగా తీసుకోవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. అల్లాహ్ తఆలా దృష్టిలో ప్రియులగుటకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరించుట అనివార్యము. మరే మార్గము ద్వారా మీరు అల్లాహ్ తఆలా దరి చేరలేరు. మానవుని జీవిత ఉద్దేశము ఏకైక, సాటిలేని అల్లాహ్ తఆలాను అన్వేషించుటయే కావలెను. మనము కేవలం ఏకైక, సాటిలేని అల్లాహ్ తఆలాను అన్వేషించవలెననే ఏకైక ఉద్దేశము నిర్ధారించుకోవలెను. మరే దానిని అన్వేషించకూడదు, అల్లాహ్ తఆలాకు ఎదురుగా మరెవరికి ప్రాధాన్యత ఇవ్వకూడదు. అన్యారాధన, దురాచారముల నుండి దూరముండవలెను. దురాచారములకు, తుచ్ఛ కోరికలకు తలొగ్గ కూడదు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వచ్ఛమైన మార్గము తప్ప మరొక మార్గము ద్వారా మానువుడు ఎన్నడు సఫలము పొందలేడు.

మరల ఇట్లనిరి. తమలో పవిత్ర స్థితిని కల్పించుకొనుము. అనగా ప్రాపంచిక ఆట పాటలు, ఐశ్వర్యము, తళుకు బెళుకు నుండి తమను తాము దూరముంచుకోగలరు. మీ ప్రతి కర్మ అల్లాహ్ తఆలా, అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశములకనుగుణంగా యుండవలెను. ఆదాయము కొరకు పని చేయుట, వ్యాపారము చేయుట నిశ్చయముగా నిషేధము కాదు. అల్లాహ్ తఆలాయే వాటిని ఆదేశించెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులు కూడ వ్యాపారము చేసేవారు. కాని అల్లాహ్ తఆలా, అతని ప్రవక్త ప్రేమ వారిలో అధికంగా యుండేది. అల్లాహ్ తఆలా ఆరాధన హక్కులు కూడ చెల్లించాలని, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి

వసల్లం ఆదేశములను పాటించాలనే వ్యాకులత వారిలో యుండేడి. మన ప్రియమైన అల్లాహ్ మనతో దూరమయ్యే ఎటువంటి పని మనతో జరగకూడదని వారు జాగ్రత్త పడేవారు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. జల్సా ఆధ్యాత్మిక వాతావరణము నుండి ప్రయోజనము పొందుటకు, తమలో పరిస్థితులను మెరుగు పరచుకొనుటకు మనము ఈ మూడు రోజుల కొరకు ఇక్కడ సమావేశమైనాము. ఇక్కడ మూడు రోజులు మనమెందుకు సమావేశమైనామో మనము ఆలోచించుకోవలెను. ఈ ఆధ్యాత్మిక వాతావరణము నుండి లబ్ది పొందుటకు, తమ స్థితిగతులను మెరుగపరచుకొనుటకు ప్రయత్నించుట, తమలో వున్న దుష్టత్వములను దూరము చేసుకొనుట, దైవస్మరణలో నిమగ్నమగుల, ఇస్తిఘ్ఫార్ వైపు దృష్టి సారించుటకే ఇక్కడ మనము గుమికూడినాము. ఈ మూడు రోజులను ఒక శిక్షణ శిబిరంగా భావించుట, తమ కర్మలలో మిగిలిన లోపాలను దూరము చేసుకొనుటకు ప్రయత్నించుటయే వివేకమైన పని.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. విశ్వాసము, నమ్మకములో అభివృద్ధి చెందుటయే జల్సా ఉద్దేశము. విజ్ఞానములో ప్రగతి చెందుట. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ఇది ప్రాపంచిక జాతరల వలె ఒక జాతర కాదు. ఇందులో గుమికూడి, అల్లరి, ఆందోళన చేసి, తమ సంఖ్యను ప్రదర్శించుట దీని ఉద్దేశము కాదు. కావున జల్సాలో పాల్గొంటున్న ప్రతి వ్యక్తిపురుషుడు, స్త్రీ, యువకుడు, వృద్ధుడు ప్రతి ఒక్కరు ఇటువైపు దృష్టిసారించవలసిన అవసరమున్నది. అతని విశ్వాసము, నమ్మకము పెరగవలెను. తద్వారా అల్లాహ్ తఆలా, అతని ప్రవక్త ప్రేమ రెట్టింపగును. మనము కేవలము ఉత్సాహము కొరకు ఒక చోట సమావేశమైనామని మనము భావించరాదు. కావున అనవసర మాటలు వెళ్లిపోవుట మన ఉద్దేశము కాదు. ఇటువంటి భావనతో వచ్చినచో జల్సా నిరర్థకమగును. సత్కర్మలు చేయాలని తెలుపుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. అల్లాహ్ తఆలా సంతృప్తి పడాలని. అతడు సంతోషించాలని, అతని ఆదేశములను పాటించుటకు మాత్రమే సత్కర్మలు చేయవలెను. పుణ్యము లభించుననే ఆలోచన రాకూడదు. ఇది నిజమైన ప్రేమ తత్వజ్ఞానము. అల్లాహ్ తఆలాతో వున్న ప్రేమ వలన అతని ఆదేశములను పాటించవలెను. ఇందులో అతని ప్రార్థనలు కూడ గలవు. అల్లాహ్ తఆలా దాసుల హక్కులు కూడ గలవు. అల్లాహ్ ఫలితము నొసంగునని అతని ఆదేశములను పాటించకూడదు. ఇది నిజమైనచో అల్లాహ్ తఆలా ఎవరిని ఫలితము నొసంగకుండా వదలడు. 'ఇన్నల్లాహ లా యుజీవు అజ్రల్ ముహ్సినీన్' అనగా అల్లాహ్ తఆలా ఉపకారుల ఫలితమును వృధా చేయడు. కాని పుణ్యము చేయువాడు ఫలితమును దృష్టియందుంచుకోకూడదు. ఎలాంటి ఆశ, బహుమానమును ఆశించకుండా పుణ్యము చేయుటయే నిజమైన సత్కర్మ అనబడును. అల్లాహ్ తఆలా తప్పక సత్కర్మకు ఫలితము నొసంగును. మన అల్లాహ్ తఆలా మనతో ఇలా వ్యవహరించినప్పుడు మనము కూడ అతని ప్రీతిని దృష్టిలో వుంచుకొని అతని ఆదేశములన్నిటిని పాటించుట మన కనీస కర్తవ్యము. హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ దేశములకు వచ్చినప్పుడు మనము మన స్థితిగతులను కూడ గుర్తుంచుకొనుట మన కర్తవ్యము. వసతులు, వసనరులు కొన్ని సార్లు సత్కర్మలలో ఆటంకముగా మారునుశీవి. పరిస్థితులు మెరుగైనప్పుడు మనిషి తన గతమును విస్మరించును. ఫలానా ప్రాపంచిక పని మనము చేయనిచో మనకు నష్టము కలుగునని మనము భావింతుము. కాని ఆహారము నొసంగువాడను నేనని అల్లాహ్ తఆలా తెలుపుచున్నాడు.

కావున హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం బైఅత్ హక్కు చెల్లించదలచినచో అల్లాహ్

తఆలా ఆరాధన హక్కు కూడ చెల్లించవలెను. అల్లాహ్ తఆలాను వ్యక్తిగతంగా ప్రేమించుచు అతని ఆరాధన హక్కును చెల్లించాలని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం మనకు సూచించిరి. వ్యక్తిగత ప్రేమతో అల్లాహ్ తఆలాను ఆరాధించినప్పుడు ప్రాపంచిక ఉద్దేశములన్ని సమసిపోవును. అప్పుడు ధార్మికతకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనిచ్చే వాస్తవము అర్థమగును. ప్రాపంచిక ఉద్దేశములు సమసిపోయినప్పుడు అల్లాహ్ తఆలా ఊహించని మార్గముల ద్వారా మానవునికి ఆహారము నొసంగును. అల్లాహ్ తఆలా ఇట్లు నుడివెను. 'వమయ్యత్తఖిల్లాహ యజ్అల్లహు మఖరజన్ వయర్జుక్‌హు మిన్ హైసు లా యహ్తసిబ్' అనగా అల్లాహ్ తఆలా నిష్టాపరతను పాటించిన వ్యక్తికి అల్లాహ్ తఆలా ఊహించని విధంగా ఏదో ఒక మర్గాన అతనికి ఆహారము నొసంగును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి.

సుఖము పొందుటకు నిష్టాపరతయే సూత్రము. అల్లాహ్ తఆలా తన దాసులను వృథా చేయడనే విషయము నిజమైనదే. వారు ఇతరులను యాచించే పరిస్థితి వారికి ఎదురు కానివ్వడు. ఒక వ్యక్తి దైవభీతి కలిగి, నిజమైన నిష్టాపరుడైనచో అతని ఏడు తరాల వరకు అల్లాహ్ తఆలా శుభము కలిగించునని నా నమ్మకము.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నేడు పెద్ద సంఖ్యలో ప్రజలు దైవ ఉనికిని నిరాకరిస్తున్నారు. కావున అల్లాహ్ తఆలా ప్రేమను మనలో పుట్టించుకొని ప్రపంచానికి దైవ ఉనికి గురించి తెలియజేయగలరు. అప్పుడే మనము ఈ జల్సా ఉద్దేశమును పూర్తి చేసినవారమగుదుము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం బైఅత్ హక్కును చెల్లించినవారమగుదుము. మనము మన సంతానము, తరాలలో కూడ అల్లాహ్ తఆలా, అతని ప్రవక్త ప్రేమ పుట్టించుటకు ప్రయత్నించవలసిన అనసవరమున్నదిచిది అల్లాహ్ తఆలా కరుణించనిదే సాధ్యము కాదని గుర్తుంచుకోగలరు. ఇటు వైపు చాలా శ్రద్ధ చూపవలసిన అవసరమున్నది. ఇందుకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక!

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

| From, | To, |
|---|---|
| ............................................ | ............................................ |
| ............................................ | ............................................ |
| ............................................ | ............................................ |
| ............................................ | ............................................ |